కృష్ణకుమారి
ప్రమోదకర్మమైన
ప్రయోజనాత్మక నవల
సూపర్ స్టార్
వివరాలుత్వరలో....

ప్రముఖ వాచీ కంపెనీకి
ఆంధ్రలో సేల్స్‌మన్ కావలెను
నెలకు జీతం లేదా కమీషన్‌పై రు. 550/-లు నెలకు సంపాదన తక్కువ గాకుండా వుండును. స్వంత చిరునామాగల కవరుతో ఎవరైతే రు. 150/-లు పెట్టగలరో వారు మాత్రమే దరఖాస్తు చేయండి.
ADVERTISER (A-1)
P. Box-9441. Delhi-51.

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక పేపా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

డా॥ పి. వి. కె. రావ్. B. A..
వైద్యవిద్వాన్. వైద్యాచార్య. సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం,నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
టి. ఓ. రోడ్. తెనాలి. ఫోన్ : 700. 1010

బీటలువారిన నేలలా వున్న పెదాలను మరోసారి నాలుకతో తడుపుకొన్నాడు రామయ్య. నీటికోసం నలువైపులా చూశాడు. విసురుగా వస్తున్న వడగాలిని చూసి ఎవరో అంటరానివాణ్ణి చూసినట్లుగా తలుపులన్నీ మూసుకున్నాయి.

ఎండ మండిపోతూంది; అంతకన్నా రామయ్య కడుపు మండుతూంది. ''ఇంత పెద్ద పెపంచంలో గుక్కెడునీళ్ళు దొరకలేదంటే సిగ్గుచేటు'' మీదున్న మురికిబట్టతో ముఖం తుడుచుకుంటూ చెట్టు [illegible]కి చేరాడు గొణుక్కుంటూ.

# నీళ్ళు

కొలకలూరి అంబుజా భూషణ్



'మేమూ వాటికోసమే చూస్తున్నాం అన్నట్టు' అక్కడున్న రెండు మూడు చెట్లు గాలికి తలలూగించినాయి. ఆ వూపుకి మిగిలున్న ఎండు టాకులు గలగల రాలినయ్.

"ఏడవకే వెర్రిమొగమా?" వాకరికియ్యటానికే మనం పుట్టింది. చెట్టును చిన్నగా నిమిరాడు.

రామయ్యకు కళ్ళు తిరిగినట్లై చెట్టుకు చేరగిలబడ్డాడు.

"ఈ నికృష్టపు బ్రతుకు బతకక పోతేనేం: నీవలన ఏమిటి లాభం" నిగ్గదీసింది రామయ్య మనసు.

"వోసి పిచ్చిమొకమా ! మాలాంటోళ్ళు లేకపోతే కథలూ, సినిమాలూ ఎట్టా వత్తాయ్ ! మాలాంటోళ్ళు ఉరేసుకుంటే గొప్పోళ్ళకి పుణ్యాలు కొరవై పోవూ" మనసునో చరుపు చరిచాడు.

కాస్త దూరంలో ఖరీదైన ఇంటిముందు చెట్ల ఆకుల్లోంచి రెపరెపలాడుతున్న చీర కొంగుని చూసి అటుకేసి నడిచాడు రామయ్య.

"కాసిని నీళ్ళుపోసి పుణ్యం కట్టుకో తల్లీ." చిన్నగా అరిచాడు. పూజ చేసుకుంటున్నావిడ మిర్రిచూసి "వేళాపాళా



ఉన్నత సాంఘిక ధృక్పథం!
కమనీయ కధలుగా మలచబడిన...
కృష్ణకుమారి
3 నవలలు
స్నేహం×ప్రేమ
కళ్యాణ్-ప్రవీణ్
కాష్మీర్, ఐలవ్‌యూ
వివరాలు త్వరలో

మెడికల్, ఇంజినీరింగ్
ఎంట్రన్స్ పరీక్షల శిక్షణ
సీట్లకు ముందుగా రిజర్వు చేసుకోవచ్చు! హాస్టలు వసతికూడా కలదు. ఏప్రియల్‌చివర వరకు గడువు. వివరాలకు వెంటనే ఒక కార్డు వ్రాయండి.
శాంతా కాలేజి
బ్రాడిపేట, గుంటూరు.
పి. శ్రీమన్నారాయణ
ప్రిన్సిపాల్.

5 76369.

సమర్థవంతమైన ర్యాలిఫ్యాన్
సర్వీసు సిబ్బంది దీని వెనక ఉంది.
మీకు ఎప్పుడైనా అవసరం అయితే!
ర్యాలిఫాన్
కాలానికి నిలుస్తుంది—ఎంతో అందంగా
nirmala
ఆడియోవిజన్
...రోడ్ ★ విజయవాడ-2

లేదేమిటి ఫో ఫో అవతలకి" వొక్క కసురు కసిరింది.

నిరాశగా గడ్డం ఓసారి సవరించుకొని నీడ పరుచుకున్న ఓ అరుగుపై ఆమెకు కనిపించకుండా కూలబడ్డాడు.

ఆ యింటిముందు కలవారి పిల్లల్లా నిగనిగలాడుతున్నాయి కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు పండ్ల భారంతో.

కాస్త దూరంలో షెడ్డులో గేదెలు నెమరువేస్తున్నాయి. చుట్టూ చూస్తున్న రామయ్య ఓ చెట్టు క్రింద ఆడుకుంటున్న ఐదేళ్ళ పిల్లాడిని చూచేసరికి సంతోషంతో పొంగిపోయాడు.

"బాబూ!" ఆవిడెక్కడ వింటుందో నన్నట్లు చిన్నగా పిలిచాడు.

"ఏం"నొసలు యెగురవేశాడు పిల్లాడు.

"ఆ కాయ యివ్వవూ!" చిలుక లు కొట్టి పడేసిన మామిడికాయ చూపుతూ అన్నాడు.

"ఛీ! ఎంగిలి-తినకూడదు. నే కోసిస్తా వుండు" ఆ కాయను దూరంగా విసురుతూ అన్నాడు.

రామయ్య ప్రాణం గిలగిలలాడింది. "పర్వాలేదు యివ్వు బాబూ. ఎంగిలివి, పాచినవీ తినటం నా కలవాటే" గుటక లేస్తూ అన్నాడు.

పిల్లాడు కాసేపు ఎగిరి, అందక గేదెల కోసం నీళ్ళు నింపిన తొట్టిపై కెక్కాడు.

గాలికి అలలుగా తిరుగుతున్న నీటిని చూడగానే రామయ్య కళ్ళు మెరిశాయి.

"కాయలొద్దు బాబూ నీళ్ళు - నీళ్ళు" తొట్టివైపు చూపించాడు కావాలన్నట్టు.

"ఇక్కడేం లేదుగా" అన్నీ ఇట్లాంటివే చెపుతావ్ అన్నట్లుగా పెట్టాడు ముఖం.

రామయ్య గుండె దిగజారిపోయింది.

నీటిపై ఛళ్ళున చరుస్తూ ముఖానపడిన నీళ్ళని విసుగ్గా తుడుచుకొంటున్నాడు పిల్లాడు.

కాసేపు ఆలోచించి చుట్టూ చూసి తన జోలెలోంచి సత్తుగ్లాసు తీసి గేట్లో గుండా అందిస్తూ "తే తే" అన్నాడు తొందరగా.

గ్లాసుతో నీళ్ళుముంచి క్రిందా మీదా పడపోస్తున్న పిల్లాడిని చూసి "గొంతు ఎండిపోతోంది దా నాయనా" గొంతు సవరించుకుంటూ బ్రతిమిలాడేడు.

"మండటం అంటే ఏమిటి?"

"మీకు తెలవదులే బాబూ. పెట్టి పుట్టి నోళ్ళు మీరు. గొప్పింటి లచ్చణాలు పోగొట్టుకున్నావు కాదు" బ్రతిమిలాడించుకోవటం చూసి గొణిగాడు రామయ్య.

రామయ్య ముఖం వంకే చూస్తున్న పిల్లాడికి జాలి కలిగింది కాబోలు, నీళ్ళు ముంచి మూసివున్న గేట్లోకి అందించాడు. పిల్లాడి చేయి వణికిందో, రామయ్య చేయి వణికిందోమరి గ్లాసు క్రింద పడిపోయింది. నీరసంగా చప్పరించాడు రామయ్య.

వెనుతిరిగాడు పిల్లాడు.

"ఎంతసేపు."

"ఉండు లోపల పడిపోయింది గ్లాసు."

"వంగి తియ్య."

"ఊహూ అందటంలా. నువ్వురా."

'అడ్డమైన వాళ్ళు రావటానికీల్లేదు' అన్నట్లుగా పొగరుగా కళ్ళుమూసుకొన్న గేటుని చూస్తూ.

"నేను రాకూడదులే బాబూ."

"ఎందుకు?"

"నేను — నేను తక్కువ జాతోణ్ణి."

"అబద్ధం చెపుతున్నావ్ తాతా! చూడు నాకన్నా ఎంత పొడుగున్నావో" రామయ్య దగ్గరకు వస్తూ అన్నాడు.

"ఎత్తులో, వయసులో, అనుభవంలో పెద్దోణ్ణే బాబూ. తండ్రివిగా నీళ్ళియ్యవా?" పిల్లాడి బుగ్గలు నిమిరాడు.

పట్టుదలగా మరికాస్త ముందు కొంగాడు పిల్లాడు.

"అందలేదు."

"అసలు నువ్వెందుకు రాకూడదు?" గ్లాసు అందలేదన్న కోపం పిల్లాడి ముఖంలో కదలాడుతుండగా అన్నాడు.

"ఈ యినపగేటుంది చూశావూ! అది గొప్పోళ్ళ గుండెకాయ బాబూ. ఒక పట్టాన తెరుచుకోదు. నువ్వూ గొప్పోడివేగా—" రామయ్య మాట పూర్తికాకముందే తొట్టిలోకి పట్టుదలగా వంగాడు పిల్లాడు.

నీటిలోంచి తప, తప కొట్టుకొనే శబ్దం "తాతా, తాతా!"అని పిలిచినట్లయి గేటుని ముందుకీ, వెనక్కీ గుంజాడు బలమంతా ఉపయోగించి. నోట మాటరాక. గేటు రాక నీళ్ళ నములుతూ తూలుతున్నాడు.

చిన్నా- పెద్దా-

గొప్పా-బీదా భేదం లేకుండా గుటకలు వేస్తూనే వున్నారు.

క్షణాలు బరువుగా దొర్లాయి.

అప్పటివరకూ వీస్తున్న గాలి స్తంభించి పోయింది. ●

